సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం। 25। నవంబర్। 2023



భవితవ్యానికి 'సహకారం'

రైతులు, ప్రజలకు సేవలందిస్తున్న డీసీసీ బ్యాంకు మరో అడుగు ముందుకేసింది. చిన్నారుల భవిషత్తుకు ఆసరాగా నిలవనుంది. -10లో



ప్రతిభావంతుల ఎంపికలు పూర్తి

జోన్-4 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంబంధించిన ఎంపికల ప్రక్రియ పూర్తి చేసినట్లు జోన్-4 ఆర్‌జేడీలు పేర్కొన్నారు. -10లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.2 /24.0

జిల్లాలో శుక్రవారం 24.0 – 30.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు డాక్టర్ ఇండ్లకు సన్మానం



కడప రూరల్: వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ గ్రహీత, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి ఈ నెల 26వ తేదీన కడపలో సన్మానం చేయనున్నట్లు ఆహ్వాన సంఘం సభ్యులు డాక్టర్ సి.బాలిరెడ్డి తెలిపారు. విజయవాడలో స్థిరపడ్డ జిల్లావాసి డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ఇటీవల ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఉదయం 10 గంటలకు సన్మాన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజద్ బాషా, జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్,శాసన సభ్యులు హాజరవుతారని బాలిరెడ్డి పేర్కొన్నారు.

షార్ట్ లిస్ట్ విడుదల

కడప రూరల్: జాతీయ అర్బన్ ఆరోగ్య పథకం కింద మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి షార్ట్ లిస్టును విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ జాబితాను కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో ఉంచామన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీన కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి రాక

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రి ఎ.నారాయణస్వామి శనివారం కడపకు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏడీఐపీ స్కీమ్ కింద దేశంలోని 21 ప్రాంతాల్లో సామాజిక అధికారిత శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా కడప జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దివ్యాంగులకు ఉచితంగా సహాయక పరికరాలను ఈ శిబిరంలో అందజేయనున్నారు. కేంద్రమంత్రి నారాయణ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ తదితరులు పాల్గొననున్నారు.

నేడు జోన్-4 బదిలీలపై విచారణ

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో జరిగిన సాధారణ బదిలీల ఆరోపణలపై శనివారం విచారణ జరగనుంది. ఈ శాఖ పరిధిలో జూన్ నెలలో బదిలీలు జరిగాయి. వీటిపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణకు ఆదేశించారు. కాగా గతంలో ఇక్కడ రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి, ప్రస్తుతం అమరావతిలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కోటేశ్వరి విచారణాధికారిగా రానున్నారు.


వైవీయూలో జాతీయ సదస్సు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 1, 2 తేదీల్లో 'వనవిల్ కె.రవి రచనల్లో భిన్న దృక్పథాలు' అన్న అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు, సెమినార్ సంచాలకులు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి తెలిపారు. ఈ సెమినార్‌కు వీసీ చింతా సుధాకర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది వనవిల్ కె.రవి, తిరుమల ఎస్వీ మ్యూజియం డైరెక్టర్ ఆచార్య ఎస్.కృష్ణారెడ్డి, అజ్మీర్ రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మిఅలియార్‌లు హాజరవుతారని తెలిపారు. వీరితో పాటు పాలక్కడ్ టీసీఆర్‌సీ డైరెక్టర్ ఆచార్య కె.ఎ.రాజారాం, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా.జిల్లెల్ల బాలాజీ, మాడభూషి సంపత్‌కుమార్ పాల్గొననున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి తెలిపారు. అంగన్వాడీ సహాయకురాలు 19, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 2 పోస్టులకు అవసరమైన అర్హతలు, పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని లేక ఈనెల 30వ తేదీలోగా ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో పొందాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలు డిసెంబరు 8వ తేది ఉదయం 10 గంటలకు సంబంధిత రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

ఎస్‌కేయూ ఇన్‌చార్జి వీసీగా చింతా సుధాకర్



వైవీయూ: అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా యోగివేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎస్కేయూ వీసీగా పనిచేసిన జిల్లావాసి ఆచార్య ఎం.రామకృష్ణారెడ్డి పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ఈయనను నియమించారు. కాగా ఆచార్య చింతా సుధాకర్ గతంలో ఎస్కేయూలో పలు హోదాల్లో పనిచేశారు.

అద్వితీయం.. అద్భుతం

- రూ. 296.65 కోట్లతో ముమ్మరంగా నాడు–నేడు పనులు
- స్కూళ్లు, అంగన్‌వాడీకేంద్రాలు, కాలేజీలకు సమకూరుతున్న వసతులు
- డిసెంబర్ చివరి నాటికి పనుల పూర్తికి కసరత్తు



రెండోవిడతలో బద్వేల్ జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు



నాడు- నేడు పనులతో కళకళలాడుతున్న పాఠశాల

కడప ఎడ్యుకేషన్: పెచ్చులూడుతున్న పైకప్పులు, అరకొర తరగతి గదులు, కిర్రుకిర్రుమనే చెక్కడెస్కులు, వరండాలు, చెట్ల కింద చదువులు ఇవన్నీ ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలకు ఆనవాళ్లు. ప్రస్తుతం పరిస్థితి మారింది. ప్రభుత్వ పాఠశాలలంటే కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు,అందమైన తరగతి గదులు, ఐఎఫ్‌సీ, స్మార్ట్ టీవీలతో బోధనలు, విద్యుత్ సౌకర్యం, రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు, గ్రీన్‌చాక్‌బోర్డు, ఇంగ్లిషు ల్యాబ్స్ తదితర సౌకర్యాలతో కళకళలాడుతున్నాయి. మౌలిక వసతుల కల్పనను పాఠశాలలతో సరిపెట్టకుండా మరో అడుగు ముందుకేసి రెండోవిడత నాడు-నేడు పనులను అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చేపట్టేలా రూ. 296.65 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు జిల్లాలో ముమ్మరంగా జరుగుతున్నాయి.

- జిల్లావ్యాప్తంగా రెండో విడత కింద 87 అంగన్‌వాడీ కేంద్రాలు, 637 ప్రాథమిక, 75 ప్రాథమికోన్నత పాఠశాలలు, 197 హైస్కూళ్లు, 9 జూనియర్ కళాశాలలు ఇలా మొత్తంగా 1005 వాటిల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. వీటిలో నాడు - నేడు కింద తాగునీరు, విద్యుత్తు సౌకర్యం,ఫర్నీచర్, గ్రీన్ చాక్‌బోర్డు, కిచెన్‌షెడ్డు, ఇంగ్లీషుల్యాబ్, పెయింట్స్, మేజర్, మైనర్ మరమ్మతులు చేస్తున్నారు. ఇందుకోసం రూ. 296.62 కోట్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు దాదాపు రూ. 100 కోట్లు ఖర్చు చేసి పలు అభివృద్ధి పనులను పేరెంట్ కమిటీ, విద్యాశాఖ ద్వారా చేశారు. మిగతా మరో రూ. 100 కోట్లకు సంబంధించి సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ఐటమ్స్ అయిన శానిటరీ, విద్యుత్తు సామగ్రి, ఫర్నీచర్, వాటర్‌ప్లాంట్, టీవీలు, గ్రీన్‌చాక్‌బోర్డులను తెప్పించారు. ఇప్పటి వరకు 1005 స్కూళ్లకు 130 స్కూళ్లలో వందశాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్నాయి. ఐదు ఇంజినీరింగ్ డిపార్టమెంట్ల ద్వారా పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇందులో పీఆర్, ఎస్ఎస్ఏ, పీహెచ్ఈడీ, ఏపీఈడబ్ల్యూడీసీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ల వారు ఉన్నారు.

ప్రత్యేక టీమ్‌తో...

జిల్లాలో జరుగుతున్న నాడు- నేడు రెండోవిడత పనులకు సంబంధించి ప్రొగ్రెస్‌పై సమగ్రశిక్ష కార్యాలయంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. టీమ్ సభ్యులు పాఠశాలల్లో పనులు ఎలా జరుగుతున్నాయి. వారికి కావాల్సిన మెటీరియల్‌ను సకాలంలో అందించడంతోపాటు ప్రొగెస్ ఎలా ఉంది. ఎక్కడైనా పనుల్లో వెనుకపడి ఉంటే ఎందుకు వెనకపడిందని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

అభివృద్ధి పనుల వివరాలు..

1 తాగునీటి సరఫరా
2. నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు
3. మేజర్, మైనర్ మరమ్మతులు
4. లైట్లు, ఫ్యాన్లతో విద్యుద్దీకరణ
5. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్
6. తరగతి గదులకు పెయింటింగ్
7. గ్రీన్ చాక్ బోర్డులు
8. వంటగది నిర్మాణం
9. ప్రహరీ గోడలు
10. ఆదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

నాడు- నేడు పాఠశాలలు, నిధుల వివరాలు ఇలా..

స్కూల్స్ కేటగిరీ	స్కూళ్ల సంఖ్య	నిధుల అడ్మిషన్ శాంక్షన్ (రూ.కోట్లలో)	రివాల్వింగ్ ఫండ్ రిలీజ్ (రూ.కోట్లలో)	ఖర్చుచేసిన నిధులు(రూ.కోట్లలో)
అంగన్‌వాడీలు	87	13.85	4.86	4.59
స్కూళ్లు	909	275.71	93.88	91.26
జూనియర్ కాలేజీలు	09	7.09	3.51	3.27

నాణ్యతతో పనులు



రెండో విడత నాడు- నేడు పనులు నాణ్యతతో జరిగేలా చర్యలు చేపట్టాం. మాతో పాటు తలిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయుల పనులను చూసుకుంటున్నారు.ఇంజినీరింగ్ అధికారులు కూడా పర్యవేక్షిస్తున్నారు. డిసెంబర్ లోగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

- ఎ.ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యుల కారుణ్య నియామకాలకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 28, 29 తేదీలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని కలెక్టరేట్‌లో హాజరు కావాలని జిల్లా ప్రజా రవాణాధికారి పాలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇతర వివరాలకు కడపలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో లేదా పర్సనల్ ఆఫీసర్ (99592 25773), సూపరింటెండెంట్ (81426 94569)లను సంప్రదించాలన్నారు.

కులగణన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అడప శేషు, డాక్టర్ కళ్యాణచక్రవర్తి

పోరుమామిళ్ల: కులగణన సంపూర్ణ విజయవంతానికి కృషి చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషు, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని డాక్టర్ కళ్యాణ చక్రవర్తి స్వగృహంలో విలేకరులతోవారు మాట్లాడుతూ దేశ జనాభాలో సింహభాగం ఉన్న బీసీల పట్ల కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఇంకా వెనుకబాటు తనానికి గురవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కులగణనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. మన అభివృద్ధిని కోరే ఆయనకు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీలకు ఇవ్వాల్సినంత శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదన్నారు. రాజాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈనెల 28న విజయవాడలో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏ కులానికి ఏ అన్యాయం జరిగింది? ఏం కావాలి? నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవి, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు, మాజీ సర్పంచ్ భూ తప్ప, వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పులివెందుల అభివృద్ధిపై సీఎం సమీక్ష

పులివెందుల: పాడా ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి కార్యాలయంలో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందులలో మెడికల్ కళాశాలతో సహా వివిధ అభివృద్ధి పనులు, సింహాద్రిపురం, వేంపల్లి మండలాల్లో జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలన్నారు. నిర్ణయించిన పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ జవహర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ విజయరామరాజు, ప్రణాళికా విభాగం కార్యదర్శి గిరిజాశంకర్ , ఫైనాన్స్ సెక్రటరీ సత్యనారాయణ, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గండికోటలో వెలుగు చూసిన శాసనం

కడప కల్చరల్: ప్రముఖ పర్యాటక, చారిత్రక ప్రాంతమైన గండికోటలో మరో శాసనం వెలుగు చూసింది. కోటలోని దేవాలయం చప్పట బండపైగల రాతి మీద నాటి తెలుగు లిపిలో ఈ శాసనం లిఖించి ఉందని భారత పురాతత్వశాఖ ఎపిగ్రఫీ విభాగం ప్రతినిధి ఆచార్య మునిరత్నంరెడ్డి తెలిపారు. 16వ శతాబ్దం నాటి ఈ శాసనం బహుశా నాటి పాలకుడు దుగ్గరాజు ఆరాధ్యదైవం రామలింగేశ్వరస్వామి పట్ల భక్తి ప్రవత్తులను చాటుకునేందుకు వేయించినట్లు తెలుస్తోందన్నారు.



గండికోటలో వెలుగు చూసిన శాసనం

సమానత్వ నినాదంతో పెద్దదర్గా ఉరుసు

కడప కల్చరల్: పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ఈ ఏడాది వినూత్నమైన పద్ధతిలో జరగనున్నాయని దర్గా ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం దర్గాలోని ముషాయిరా హాలులో వారు విలేకరులతో మాట్లాడారు. దర్గా పీఠాధిపతి సర్వమత సమానత్వాన్ని కాంక్షిస్తారని, ఇందులో భాగంగా ఈసారి ఉరుసు ఉత్సవాలు మత సామరస్యానికి నిలువెత్తు ప్రతీకగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీఖాన్ వివరించారు. దర్గా పట్ల దేశ విదేశాల్లో అచంచల భక్తి విశ్వాసాలుగల వారెందరో ఉన్నారని, పెద్ద సంఖ్యలో ఉరుసు ఉత్సవాలకు రానున్నారని, వారందరికీ ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దర్గా సమీపంలోని బాల పోలేరమ్మ, బాలాజీ ఆలయం, పాండురంగస్వామి ఆలయం, మాచుపల్లె సర్కిల్‌లోని బెత్లెహం చర్చి తదితర ప్రాంతాలను శుభ్రపరిచి సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. 27న మేరీ మిలన్ పేరిట అన్ని వర్గాల ప్రముఖులను ఆహ్వానించి విందు ఇవ్వనున్నట్లు చెప్పారు. దర్గా ముజావర్ అమీర్ మాట్లాడుతూ 26న రాత్రి మలంగ్‌షా దీక్ష వహించడంతో ఉరుసు ప్రారంభమవుతుందన్నారు. అదేరోజు గంధం, 27న ఉరుసు ఉంటుందన్నారు. ఆరోజున కడప పరిధిలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని అధికారులకు విన్నవించామన్నారు. 30న పీఠాధిపతి ఊరేగింపు ఉంటుందన్నారు. దర్గా ప్రతినిధి ఆరీఫ్‌ఖాన్ మాట్లాడుతూ ముషాయిరాలో ప్రముఖ కవులు పాల్గొంటారన్నారు. ఉరుసు ఉత్సవాల ప్రారంభ సూచికగా శనివారం ఉదయం 9.30 గంటలకు దర్గా ప్రాంగణంలో బెలూన్‌ను ఆవిష్కరించి ఎగుర వేయనున్నట్లు దర్గా ప్రతినిధులు తెలిపారు. దర్గా ప్రతినిధులు ఖుతుబుద్దీన్, ఆరీఫ్, అన్వర్, ఖాసిం, ఫైజుద్దీన్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దర్గా ప్రతినిధులు

అరకొర గుంత.. అదే వారికి వింత

- పచ్చగంతలు కట్టి.. పిచ్చిగుంతలకు దడికట్టి
- టీడీపీ, జనసేన దొంగాటకం
- లక్షణంగా ఉన్న రహదారులు
- కళ్లు తెరిచి చూడమంటున్న ప్రజలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా రహదారులపై టీడీపీ, దాని అనుబంధ జనసేన నాయకులు గత శని, ఆదివారాల్లో నానా యాగీ చేశారు. 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదీ' అని ఓ కార్యక్రమం పెట్టుకున్నారు. ఏదో ఒక విధంగా ప్రభుత్వంపై బురదజల్లుతూ ప్రజలను మభ్యపెట్టడం ద్వారా రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రోజుకొక కొత్త నాటకానికి తెర తీయడంలో భాగమే ఈ గుంతల కార్యక్రమం. ఇందులో భాగంగా రోడ్లపై అరకొరగా ఏర్పడిన గుంతలను ఫొటోలు, వీడియోలు తీసారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి క్షణికానందం పొందారు. ఎలాంటి రహదారిపైన అయినా కొన్నేళ్ల తర్వాత చిన్నపాటి గుంతలు ఏర్పడటం ఎక్కడైనా సహజమే. అలా ఎక్కడో ఒకటి, రెండుచోట్ల ఉన్న చిన్న గుంతలను టీడీపీ, జనసేన నాయకులు భూతద్దంలో చూపించే ప్రయత్నం చేశాయి. వీటికి చిలువలు పలవలు జోడించి వింత వ్యాఖ్యానాలతో మీడియాలో మాటలతో గారడీ చేయబూనారు. పైగా రోడ్డు ప్రమాదాలన్నీ వీటి వల్లే జరిగాయని, ప్రమాద మరణాలన్నీ ప్రభుత్వ హత్యలంటూ పేర్కొనడం వీరి వికృతపోకడలకు పరాకాష్ట. వీరి చిత్తచాపల్యం గమనించినవారు.. మరి 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో జరిగిన వేలాది రోడ్డు ప్రమాద మరణాలు కూడా ప్రభుత్వ హత్యల కిందకు రావా అని ప్రశ్నిస్తున్నారు.



గుంతలు లేని బద్వేలు పురపాలక సంఘం పరిధిలోని భాకరాపేట రోడ్డు వద్ద టీడీపీ నాయకుల హడావుడి (ఫైల్)



రూ. 120 లక్షల వ్యయంతో గాలివీడు మండలం గోపనపల్లె నుంచి లక్కంవాండ్లపల్లె వరకు నిర్మించిన రహదారి

రహదారులకు ప్రాధాన్యత

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ కనెక్టివిటీ ప్రాజెక్టు (ఏపీ ఆర్‌ఆర్‌పీ) గ్రాంటు, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ప్యాకేజీ, పీఎం జీఎస్‌ఐ ఫేజ్-3, ఏఎంసీ గ్రాంటు కింద జిల్లాలో ఎన్నో కొత్త రహదారులు ఇప్పటికే రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు మళ్లీ కొత్తగా రూ.115.86 కోట్లతో 32 రహదారుల నిర్మాణాలకు త్వరలో టెండర్లు పిలవనున్నారు.

విప్పితే పచ్చగంతలు.. కనపడవు పిచ్చిగుంతలు

సీఎం వై.ఎస్.జగన్ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన రహదారులు చక్కగా మెరిసిపోతున్నా టీడీపీ, జనసేనలకు కనిపించడం లేదు. అందుకే గత శని, ఆదివారాలు రెండురోజుల పాటు 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదీ' అంటూ వీరు చేసిన హడావుడిని చూసి జనం నవ్వుకుంటున్నారు. గ్రామీణ రహదారులు సైతం పాలుపోసి ఎత్తుకునేలా అగుపిస్తున్నా అగుపడనట్లు నటించిన వీరిపై కళ్లకు కట్టుకున్న పచ్చగంతలు విప్పితే కనపడవు పిచ్చి గుంతలు అంటూ ఎద్దేవా చేస్తున్నారు.



ఏఎంసీ గ్రాంటు కింద కొండాపురం మండలం వంగనూరు నుంచి కోడూరు వరకు నిర్మించిన రోడ్డు



రూ. 355.24 లక్షలతో ఎర్రమిట్ట, వీవీ కండ్రిగ రోడ్డు నుంచి శాంతినగర్ వరకు నిర్మించిన రహదారి



రూ. 747.21 లక్షల అంచనా వ్యయంతో సింహాద్రిపురం మండలం హిమకుంట్ల గ్రామం నుంచి సుంకేసుల వరకు నిర్మించిన రహదారి



చాపాడు మండలం రామచంద్రనగర్ కుచ్చుపాప నుంచి వెదురూరుకు వెళ్లే రహదారి



రూ. 621.61 లక్షల అంచనాతో పెండ్లిమర్రి మండలం రేపల్లె, కోనాయపల్లె మీదుగా నిర్మించిన చౌటపల్లె-పాత సంగటిపల్లె రహదారి



రూ. 220 లక్షల అంచనా వ్యయంతో చాపాడు మండలం నక్కలదిన్నె నుంచి కల్లూరు వరకు నిర్మించిన రహదారి

చిన్నారుల భవితవ్యానికి సహకారం

- భవిష్యత్తు తరాలకు భరోసాగా... ఉన్నత చదువులకు అండగా
- డీసీసీ బ్యాంకులో ఖాతాదారులకు పలు పథకాలు
- చిన్నారులకు ప్రత్యేక పొదుపు డిపాజిట్ ఖాతాలు
- జనవరి 30వ తేదీ వరకు రూ. 100తో ఖాతా
- కడప డీసీసీ బ్యాంకులో అమలుకు శ్రీకారం



కిడ్డీ బాక్స్‌ను అందజేస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా, బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : రైతులు, ప్రజలకు సేవలందిస్తున్న జిల్లా సహకార బ్యాంకు మరో అడుగు ముందుకేసి చిన్నారుల భవిష్యత్తుకు ఆసరాగా నిలువనుంది. పిల్లలకు చదువుతోపాటు చిన్నతనం నుంచే పొదుపుపై అవగాహన కల్పించేందుకు, డబ్బు విలువను పిల్లలకు తెలియ చేసేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నడుం బిగించింది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు తమ తల్లితండ్రులు పాఠశాలల్లో విశ్రాంత సమయంలో (ఇంటర్ వెల్) ఏవైనా తినుబండారాలను కొనుగోలు చేసుకునేందుకు ప్యాకెట్ మనీ కింద కొంత డబ్బులను ఇచ్చి పంపుతారు. వాటితో ఏదో రకమైన తినుబండారాలను కొనుగోలు చేసి తింటుంటారు. ఈ అడ్డగోలు తినుబండారాలు చిన్నారుల ఆరోగ్యాలకు చేటు చేయనున్నాయి. సంబంధిత వాటి నుంచి పిల్లలను దారి మళ్లించడంతోపాటు వారికి చిన్నతనం నుంచే పొదుపుపైన అవగాహన పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

చైర్‌పర్సన్ మదిలో మెదలిన ఆలోచనే..

డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి ఇటీవల బ్యాంకు సమావేశం నిమిత్తం కేరళకు క్యాంపు వెళ్లారు. అక్కడ ఓ పాఠశాలలో చిన్న కాయిన్ బాక్స్‌ను ఏర్పాటు చేసి ఉండటాన్ని గమనించారు. దీనిపై అక్కడ సిబ్బందితో ఆరా తీశారు. వారు చెప్పిన దానికి ఆమె ఇన్‌స్పైర్ అయ్యి మన జిల్లా పిల్లలకు కూడా ఇలాంటిది చేస్తే బాగుంటుందని తన మదిలో మెదలిన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. దీనిపై బ్యాంకు అధికారులతో సమీక్ష చేసి కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిపై బ్యాంకు సిబ్బంది కసరత్తు చేస్తూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంబంధిత కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. పిల్లలకు కావాల్సిన కిడ్డీ బాక్స్‌కు ఉచితంగా అందిస్తున్నారు. బ్యాంకు వారు చేసిన ఈ వినూత్న కార్యక్రమంపై పిల్లల తల్లితండ్రుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే వైఎస్సార్ కడప జిల్లాలో ప్రప్రథమంగా అమలు చేయడం హర్షణీయం.

వంద రూపాయలకే ఖాతా :

సాధారణంగా డీసీసీ బ్యాంకులో ఖాతా ప్రారంభించాలంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు కట్టించుకుని ఖాతాను ప్రారంభిస్తారు. అది కూడా చిన్నపిల్లలకు ఖాతాలను ప్రారంభించరు. అలాంటింది ప్రత్యేక కార్యక్రమం కింద చిన్నారులకు పొదుపు డిపాజిట్ ఖాతాలను ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం డీసీసీ బ్యాంకు ప్రత్యేక మేళా ఏర్పాటు చేసి పుట్టిన బిడ్డ నుంచి 15 సంవత్సరాలోపు చిన్నారులకు ఖాతాను ప్రారంభిస్తున్నారు. ఈ విషయమై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఈ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ స్కీమ్‌ను ప్రస్తుతం ప్రత్యేక మేళా కింద 2024 జనవరి 30వ తేదీ వరకు వంద రూపాయలకే ఖాతాను తెరవనున్నారు.

చిన్నతనం నుంచే..

చిన్నారుల పేరుతో పొదుపు ఖాతాలను ప్రారంభించడం వల్ల వారికి పొదుపు ఆవస్యకత పెరగడంతో పాటు బ్యాంకింగ్ అలవాటు అవుతుంది. ఇందు కోసం కడప డీసీసీ బ్యాంకు వారు పిల్లలకు అవగాహన కల్పించేందుకు స్కూళ్లకు వెళ్లి కిడ్స్ బ్యాంకుపై అవగాహన కల్పిస్తున్నారు. ఖాతా ఓపెన్ చేసేవారికి కిడ్డీ బ్యాంకు (డబ్బా) ఉచితంగా పిల్లలకు అందిస్తున్నారు. పిల్లలు ఆ డబ్బాలో డబ్బు వేసుకోవాలని సూచనలిస్తున్నారు. అయితే ఆ డబ్బులో వేసిన డబ్బులను మళ్లీ పిల్లలు మనసు మార్చుకొని వెనక్కు తీసుకోకుండా ఆ డబ్బా తాళాలు బ్యాంకు వాళ్ల వద్ద పెట్టుకుంటారు. ఇలా పిల్లలు రోజువారిగా వేసే డబ్బులను నెల తర్వాత బ్యాంకుకు తీసుకుని వచ్చి పిల్లల ఖాతాలో జమచేయబడుతుంది. ఇలా డిపాజిట్ చేసిన డబ్బులకు బ్యాంకు వాళ్లు ఆకర్షనీయమైన వడ్డీని కూడా ఇవ్వనున్నారు.

ఆర్‌డీ ఖాతా కింద డిపాజిట్ చేస్తే 120 నెలల తర్వాత వచ్చే డబ్బు వివరాలు..

డిపాజిట్ నెలకు	గడువు తరువాత లభించే మొత్తం
రూ.100	రూ.17,730
రూ.500	రూ.86,851
రూ.1000	రూ.1,73,702
రూ.2000	రూ.3,47,403
రూ.3000	రూ.5,21,105
రూ.4000	రూ.6,94,807
రూ.5000	రూ.8,68,509
రూ.6000	రూ.10,12,210
రూ.7000	రూ.12,15,912
రూ.8000	రూ.13,89,614
రూ.9000	రూ.15,63,316
రూ.10000	రూ.17,37,017

120 నెలల తరువాత వచ్చే డబ్బుల వివరాలు..

డిపాజిట్ నెలకు	గడువు తరువాత లభించే మొత్తం
రూ.10,000	రూ.20,016
రూ.15,000	రూ.30,024
రూ.20,000	రూ.40,032
రూ.25,000	రూ.50,040
రూ.30,000	రూ.60,048
రూ.35,000	రూ.70,056
రూ.40,000	రూ.80,064
రూ.45,000	రూ.90,072
రూ.50,000	రూ.1,00,080
రూ. 1,00,000	రూ.2,00,160

కిడ్స్ రికరింగ్ డిపాజిట్(ఆర్‌డీ) ఖాతాలు :

పిల్లలకు మినిమమ్ డిపాజిట్ కింద రూ. 100 నుంచి అత్యధికంగా రూ. 10 వేల వరకు ఉంటుంది. ఇలాంటి డిపాజిట్ ఖాతాల కాల పరిమితి 120 నెలలు ఉంటుంది. ఇలాంటి డిపాజిట్లకు ఇన్సూరెన్స్ గ్యారెంటీ కూడా ఉంటుంది.

కిడ్స్ డిపాజిట్ (ఎఫ్‌డీఆర్)ఖాతాలు...

ఈ ఖాతా కింద మినిమం డిపాజిట్ కింద రూ. 10 వేలు ఉంటుంది. అత్యధికంగా డిపాజిట్ కింద రూ. లక్ష వరకు వేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి కూడా కాల పరిమితి 120 నెలలపాటు ఉంటుంది. ఈ డిపాజిట్‌పై వడ్డీ రేటు సంవత్సరానికి 7 శాతం ఉంటుంది. దీనిని నామినేషన్ సౌకర్యంతోపాటు డిపాజిట్లకు ఇన్సూరెన్స్ గ్యారెంటీ కూడా ఉంది.

పిల్లల ఉన్నత విద్యకు..



డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సూచనల మేరకు చిన్నారులను చదువుతో పాటు పొదుపును ప్రోత్సహించడం కోసం డీసీసీ బ్యాంకు ప్రత్యేకంగా డిపాజిట్, పొదుపునకు సంబంధించి కొత్త స్కీంను ప్రారంభిస్తోంది. ఈ స్కీమ్ ద్వారా పిల్లలు పొదుపు, డిపాజిట్ చేసుకున్న డబ్బులను నేల కొకసారి తీసి బ్యాంకులో డిపాజిట్ చేస్తాం. ఆ డబ్బులు వారి ఉన్నత విద్య అండగా ఉపయోకపడతాయి. దీంతో పాటు వివాహం వంటి కీలకమైన బాధ్యతలను నేరవేర్చుటకు తల్లిదండ్రులకు కూడా ఆసరాగా ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచే పొదుపుపై అవగాహన కల్పించాలి.

– కందుల రాజేంద్రకుమార్, సీఈఓ, డీసీసీ బ్యాంకు, కడప

క్లుప్తంగా

గండికోట డెస్టినేషన్ లోగో పోటీ

కడప కల్చరల్ : గండికోట డెస్టినేషన్‌కు లోగోతో పాటు ట్యాగ్‌లైన్ తయారు చేసే పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టర్ తన చాంబర్‌లో లోగో తయారీ ఫ్లయర్‌ను ఆవిష్కరించారన్నారు. ఈ పోటీలో ప్రజలతోపాటు విద్యార్థులు, విద్యావంతులు ఆసక్తిగల వారందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. లోగోతోపాటు ట్యాగ్‌లైన్ తయారు చేసేందుకు డిసెంబరు 2వ తేదీ వరకు గడువు ఉందని, గండికోటకు ఆకర్శణీయమైన లోగో, ట్యాగ్‌లైన్ తయారు చేయాలని కోరారు. ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ. 25 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 15 వేలు, ట్యాగ్‌లైన్‌కు ప్రోత్సాహక బహుమతి అందజేస్తారన్నారు. పోటీదారులు లోగో లేదా ట్యాగ్‌లైన్ కలిపిగానీ, విడివిడిగా కానీ పాల్గొనవచ్చన్నారు. వివరాలకు హెచ్‌టీటీపీఎస్://కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

పులివెందుల టౌన్ : ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీవరకు గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 బేస్‌బాల్ పోటీలలో పులివెందుల రమణప్ప సత్రంబడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.యశ్వంత్ కుమార్ అనే క్రీడాకారుడు జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్, పీఈటీ వరప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారుడు రేపు నెలలో చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి ఎంపికపట్ల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన కాశీం బాషా

వేంపల్లె : స్థానిక కడప – పులివెందుల బైపాస్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంకు వద్ద బైకు అదుపు తప్పి ముగ్గురికి గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ తిరుపాల్ నాయక్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పాములూరు గ్రామంలో సెంట్రింగ్ పనులకు వేంపల్లె పట్టణంలోని బిడాలమిట్ట వీధికి చెందిన షేక్ సయ్యద్ ఖాసీం బాషా, మదర్సా వల్లి, సయ్య అబ్దుల్ వెళ్లారు. అనంతరం మధ్యాహ్నం భోజనానికి వేంపల్లె బైపాస్ రోడ్డు వద్దకు వచ్చారు. ఆ తర్వాత మదర్సావల్లి అబ్దుల్ తిరిగి పాములూరుకు నడుచుకుంటూ వెళుతుండగా కాశీం బాషా స్పీడ్‌గా వారి మీదకు బైకుపై దూసుకువచ్చాడు. బైకు ఇద్దరిని ఢీకొట్టుకుంటూ రోడ్డు పక్కన చెట్లలోకి వెళ్లింది. కాశీం బాషాకు తీవ్ర గాయాలు కాగా, మదర్సావలి, సయ్యద్ అబ్దుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాశీం బాషా తలకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. అతడిని కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదంతో గ్రేడ్–2 జేఎల్‌ఎం మృతి



రామచంద్రారెడ్డి మృత దేహాన్ని పరిశీలిస్తున్న వైఎస్ కొండారెడ్డి, అధికారులు



జేఎల్‌ఎం శ్రీరామ చంద్రారెడ్డి(ఫైల్)

చక్రాయపేట : విధి నిర్వహణలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ హెచ్ జి ఫ్యూజులు వేయడానికి స్తంభం ఎక్కి విద్యుత్ ప్రమాదానికి గురై గ్రేడ్–2 జేఎల్‌ఎం శ్రీరామ చంద్రారెడ్డి(25) మృతి చెందాడు. ఈసంఘటన శుక్రవారం చక్రాయపేట తహసీల్దారు కార్యాలయానికి సమీపంలో ఉన్న పెన్నబడి గంగిరెడ్డి అనే రైతు పొలంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి మండల ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ ప్రవీణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రారెడ్డి ఉదయం 8–30 గంటల సమయంలో సురభి ఫీడర్‌కు సంబంధించి ఎల్‌సీ తీసుకున్నాడు. ఎల్‌సీ తీసుకుంటే 20 నిముషాల లోపు వెనక్కు ఇవ్వాలి. ఆలస్యమైతే తగిన సమాచారం ఇవ్వాలి. అలా కాకుండా అతని నుంచి ఎంత సేపటికి సమాచారం రాక పోవడంతో తమ సిబ్బంది ఆయనకు ఫోన్ చేయడం మొదలెట్టారు. ఫోన్ రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయక పోవడంతో అనుమానం కలిగి సిబ్బందిని సురభి ఫీడర్ వైపు వెతకడానికి పంపడమే కాకుండా పోలీసులకు అతని ఫోన్ లోకేషన్ కనిపెట్టాలని సమాచారం ఇచ్చామన్నారు. దీంతో పోలీసులు చెప్పిన లోకేషన్ మేరకు వెళ్లగా అక్కడ రామచంద్రారెడ్డి శవం కనిపించారని చెప్పారు. అయితే సురభి ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకొని కుప్పం ఫీడర్ లైన్ ఎందుకు ఎక్కాడో, అతనికి ఎవరెవరు ఫోన్ చేశారో తగిన ఫోన్ కాల్ డేటాతో పాటు సంఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ వివరించారు. ఏఈ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. జేఎల్‌ఎం శ్రీరామ చంద్రారెడ్డి విదుత్ ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న మండల ఇన్‌చార్జ్ వైఎస్ కొండారెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటణపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మంత్రి అంబటికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటిరాంబాబును బద్వేలులో ఘనంగా సన్మానించారు. బద్వేలులో ఓ వివాహానికి హాజరైన ఆయన తిరుగు ప్రయాణంలో వైఎస్సార్‌సీపీ గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, సగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంటరమణమ్మల ఆహ్వానం మేరకు శుక్రవారం వారి ఇంట్లో అల్పాహార విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి (నార్త్‌అమెరికా) పందుగాయలరత్నాకర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మౌలాలి, సంద్రశ్రీనుయాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



వైవీయూ సీఈ ఎస్.ఈశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రీడల్లో గెలుపోటములు సహజమేనని యోగివేమన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎస్.ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ కళాశాలలో శుక్రవారం యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల, వైఎస్సార్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల స్పోర్ట్స్‌మీట్ ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలోక్రీడలు అంతర్భాగమని, క్రీడల వల్ల మనిషి గెలుపోటములు తట్టుకునే శక్తి అలవడుతుందన్నారు. వైవీయూ క్రీడాశాఖ సహ ఆచార్యులు డాక్టర్.కే. రామసుబ్బారెడ్డి క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. వైవీయూ పరిధిలోని డిగ్రీకళాశాలకు చెందిన 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాడ్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్ విభాగాలలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరి నరసింహారెడ్డి, వివిధ కళాశాలల వ్యాయామ అధ్యాపకులు, కోచ్‌లు పాల్గొన్నారు.



చాలా సంతోషంగా ఉంది



మాది రాజుపాళెం మండలంలోని సీహెచ్ కూలూరు పంచాయతీలోని ఉప్పలపాడు గ్రామం. రేషన్ కార్డులో పేరు యాడ్ చేయాలంటే గత మూడేళ్లుగా కావడం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డులో నాపేరు యాడ్ చేసేందుకు అవకాశం వచ్చిందని వలంటీర్ పద్మావతి తెలిపారు. వెంటనే రేషన్‌కార్డులో నాపేరు ఎక్కింది. – అచ్చమ్మగారి మంజు, ఉప్పలపాడు గ్రామం, రాజుపాళెం మండలం

సొంతింటి కల నెరవేరింది



మేము 18 ఏళ్ళుగా ముద్దనూరు మండల కేంద్రంలో నివాసం వుంటున్నాం. నాకు భర్త, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. చిన్న టిఫెన్ సెంటర్ పెట్టుకుని జీవిస్తున్నాం. మాకు సొంత ఇళ్లు లేదు. గతంలో పలుమార్లు ఇంటి స్థలం, పక్కాగృహం కోసం దరఖాస్తు చేసుకున్నాం. కేవలం ఇళ్లు మాత్రమే మంజూరైంది. సొంత స్థలం లేకపోవడంతో ఇంటి నిర్మాణం చేసుకోలేకపోయాం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇంటి స్థలం , పక్కాగృహానికి దరఖాస్తు చేసుకున్నాను. ముద్దనూరు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం, ఇళ్లు మంజూరైంది. అధికారుల సహకారంతో ఇంటి నిర్మాణం పూర్తిచేసి గృహ ప్రవేశం చేశాం. సొంతింటి కల నెరవేరింది.

– గొడుగు కుష్బూ, ముద్దనూరు

విద్యా వ్యవస్థకు పెద్ద పీట



జగనన్న ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేసింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలు ఎంతో అభివృద్ధి చెందాయి. గత ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలే ఇచ్చిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక విద్యార్థుకు జగనన్న విద్యాకానుకలో భాగంగా నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు బూట్లు, టై, బెల్టు, డిక్షనరీ, జగనన గోరుముద్ద వంటివి మంజూరు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు కూడా ప్రభుత్వం పాఠశాలలో చేరారు. అమ్మఒడి పథకం ద్వారా పేద , బడుగు, బలహీన వర్గాల వారికి మంచి జరిగింది. ఆంగ్లవిద్యను ప్రభుత్వం పాఠశాలలో అమలు చేశారు. – యామవరం రామకేశవ, హెచ్‌ఎం, ఎంపీయూపీ స్కూల్

జోన్–4 ప్రతిభావంతుల ఎంపికలు పూర్తి

– ఆన్యువల్ ఫెస్ట్–23 సెలక్షన్ కమిటీ సమావేశంలో ఆర్‌జేడీలు



మాట్లాడుతున్న జోన్–4 ఆర్‌జేడీలు, పాల్గొన్న ప్రిన్సిపాల్స్

వైవీయూ : జోన్–4 (రాయలసీమ) పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాలలు, అధ్యాపకులు, విద్యార్థులకు సంబంధించిన ఎంపికల ప్రక్రియ పూర్తి చేసినట్లు జోన్–4 ఆర్‌జేడీలు డాక్టర్ నాగలింగారెడ్డి (కర్నూలు, అనంతపురం), డా. బాబు (కడప, చిత్తూరు) పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (నోడల్ రీసోర్స్ సెంటర్)లో రాయలసీమ జోన్ పరిధిలోని 16 డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలిసి ఆన్యువల్ ఫెస్ట్–2023 జోనల్‌స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు విచ్చేసిన ఆర్‌జేడీలు మాట్లాడుతూ కళాశాల కమిషనరేట్ ఆదేశాల మేరకు రాయలసీమ జోన్ పరిధిలోని అన్ని కళాశాలల నుంచి నోడల్ రీసోర్స్ సెంటర్ ఎంపిక చేసిన వివిధ విభాగాలకు చెందిన ప్రతిభావంతులకు సంబంధించిన సమాచారాన్ని స్క్రూటినీ చేసి జోనల్‌స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జోనల్‌స్థాయిలో ఎంపికైన ప్రతిభావంతుల జాబితాను రాష్ట్రస్థాయి సెలక్షన్ కమిటీకి పంపుతున్నట్లు తెలిపారు. కళాశాల విభాగం కేటగిరీలో 18 పురస్కారాలు, విద్యార్థుల కేటగిరీలో 8 పురస్కారాలు, అధ్యాపకుల కేటగిరీలో 3 పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ రీసోర్స్ సెంటర్ ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, జోన్–4 పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమిళనాడులోని తిరువన్నామలై అరుణాచల గిరి ప్రదక్షిణకు ఈనెల 26వ తేదీన జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు.

- జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం 5.30 గంటలకు బస్సు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌మీదుగా వెళుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులో రూ. 1557 చార్జి నిర్ణయించారన్నారు.
- మైదుకూరు డిపో నుంచి పోరుమామిళ్లలో ఉదయం 6, 6.30, 6.45 గంటలకు బస్సు బయలుదేరి మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుంది. రూ. 1414, రూ. 1135గా చార్జి ఉంటుందన్నారు. మరో బస్సు ఉదయం 6.15 గంటలకు మైదుకూరు నుంచి కడప మీదుగా బయలుదేరుతుందన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 5.30, 7.30 గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా.. మరో రెండు బస్సులు, బద్వేలు నుంచి ఉదయం 6.00, 6.30 గంటలకు కడప మీదుగా వెళతాయన్నారు. ఈ బస్సుల్లో చార్జీలు రూ. 1566, రూ. 1475గా నిర్ణయించామన్నారు.
- కడప డిపో నుంచి ఉదయం 5, 5.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. చార్జీ రూ. 1072గా ఉందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7, 7.30 గంటలకు పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా బస్సులు వెళతాయన్నారు.చార్జి రూ. 1242గా ఉంటుందన్నారు.

పోటాపోటీగా రెజ్లింగ్ జట్టు ఎంపికలు

- 28 నుంచి చండీఘర్‌లో పోటీలు
- ఎంపికైన జేఎన్‌టీయూ–ఏ రెజ్లింగ్ జట్టు



ఎంపికైన జేఎన్‌టీయూ–ఏ రెజ్లింగ్ జట్టుతో సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి

రాజంపేట : జేఎన్‌టీయూఏ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ జట్టు ఎంపికలు పోటాపోటీగా ఏఐటీఎస్‌లో శుక్రవారం కొనసాగాయి. ఈ ఎంపికకు జేఎన్‌టీయూ–ఏ సెక్రటరీ ఆఫ్ స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ–ఏ తరపున పంజాబ్ చండీగర్ యూనివర్సిటీలో నవంబరు 28 నుంచి డిసెంబరు1వ తేదీ వరకు ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ రెజ్లింగ్ పోటీలలో పాల్గొంటారన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ రెజ్లింగ్ ఎంపికలు ఏఐటీఎస్‌లో జరగడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైనా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టరు డా.నాగముని, ఎన్ఐఎస్ కోచ్ అండ్ రెఫరీలు గణేష్, రేణుక , అసిస్టెంట్ ఫిజికల్ డైరక్టరు సైపుల్లా పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ– ఏ రెజ్లింగ్ జట్టు ఇదే..

రెజ్లింగ్ జట్టును స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి ప్రకటించారు. కె.సాయివిఘ్నేశ్వరరెడ్డి(ఏఐటీఎస్,రాజంపేట), హరిప్రసాద్(వేము కాలేజి చిత్తూరు), కెబీఖాదర్‌బాషా(ఏఐటీఎస్,రాజంపేట), కె.జగన్‌మోహన్‌రెడ్డి (ఏఐటీఎస్,రాజంపేట), వెంకటేశ్(కడప), సుస్మిత(ఏఐటీఎస్,రాజంపేట), కె.అర్చన (ఎస్‌వీసీ, తిరుపతి), మునిశేఖర్ (ఏఐటీఎస్, రాజంపేట), వందన(కెఎస్ఆర్ఎం, కడప), సుమన్(ఏఐటీఎస్,రాజంపేట), విష్ణు (జేఎన్‌టీయుఏ ,అనంతపురం), అభిషేక్ (నారాయణ, గూడూరు), వంశీకృష్ణ (ఎస్‌వీసీ, తిరుపతి) జట్టుకు ఎంపికయ్యారు.

ముగిసిన బ్రహ్మంగారి జయంతి వేడుకలు





కలశాల గ్రామోత్సవంలో భక్తులు, బ్రహ్మంగారి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

- 415 కలశాలతో పుర వీధులలో ఊరేగింపు
- హోమంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతి కుమారులు

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రభోద కర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 415వ జయంతి వేడుకలు శుక్రవారం మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో 415 కలశాలకు ఆస్థాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రయ్యస్వామి దంపతులు పాల్గొని పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులు కలశాలతో మఠం పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. పార్కులో ఉన్న బ్రహ్మంగారి విగ్రహానికి అభిషేకం, క్షీరాభిషేకం చేశారు.